క్లుప్తంగా

పామిడిలో హైకోర్టు జడ్జి



సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో జడ్జి సురేష్‌కుమార్‌రెడ్డి

పామిడి: పామిడికి శనివారం ఏపీ హైకోర్టు జడ్జీ సురేష్‌కుమార్‌రెడ్డి విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. సొంత గ్రామం గార్లదిన్నె మండలం తరిమెల గ్రామంలో 40 సెంట్ల భూమి కొనుగోలుకు సంబంధించి రిజిస్ట్రేషన్ నిమిత్తమై ఆయన విచ్చేశారు. ఈసందర్భంగా జడ్జిని సబ్-రిజిస్ట్రార్ రాధారమణతో పాటు సీనియర్ అసిస్టెంట్ జయలక్ష్మి, సిబ్బంది ఘనంగా స్వాగతించారు. ఆయనకు సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

గేట్స్‌లో ముగిసిన 'ఎఫ్‌డీపీ'



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ ప్రొఫెసర్ సత్యనారాయణ

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 21 నుంచి జరుగుతున్న రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ బయో డిగ్రేడబుల్ పాలిమర్స్ ఫర్ సస్టైనబుల్ అప్లికేషన్స్‌పై అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ కార్యక్రమం) శనివారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జేఎన్‌టీయూ అకడమిక్ ప్లానింగ్ ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాలిమర్ ప్యాకేజింగ్, ఆరోగ్య పరిరక్షణ రంగాల్లో వాడే పర్యావరణ హిత పదార్థాలపై తాజా పరిశోధనలు, ఆవిష్కరణలను పరిశోధకులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, కో-ఆర్డినేటర్ హరిప్రియ, సహ కో-ఆర్డినేటర్ ఖాసీం బీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

గుత్తి రూరల్: విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ ఆదేశించారు. మండలంలోని అబ్బేదొడ్డి ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు రోజూ భోజనం మెనూ ప్రకారం వండి పెట్టాలని ఏజెన్సీ మహిళలకు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. పీ-4, ఇతర సర్వేలు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి ఎంపీడీఓ ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటింటికీ చంద్రబాబు మోసాలు



గార్లదిన్నె మండలం ముంటిమడుగులో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



యాడికి మండలం నగరూరులో కూటమి వైఫల్యాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి



శింగనమల మండలం ఉల్లికల్లులో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'లో వైఎస్సార్‌సీపీ నాయకులు

గార్లదిన్నె/యాడికి/తాడిపత్రి టౌన్/శింగనమల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని చంద్రబాబు మోసాలను ఇంటింటికీ తీసుకెళ్దామని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం గార్లదిన్నె మండలంలోని ముంటిముగు, కొత్తూరు, కొత్తపల్లి, అంకంపేట, రామ్‌దాస్‌పేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటనారాయణ, శింగనమల నియోజకవర్గ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పుల్లారెడ్డి, మోహన్ రెడ్డి, రామన్న, బాబు ,ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- యాడికి మండలంలోని నగరూరు గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామి రెడ్డి ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు భోగాతి రుక్మాందర రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు శివకేశవ రెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భోగాతి బ్రహ్మానందరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, రామాంజుల రెడ్డి, కిట్టు, నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- శింగనమల మండలంలోని ఉల్లికల్లు, కొరివిపల్లి, జూలకాల్వ, పెద్ద జలాలపురం గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్, రైతు విభాగం కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి, సర్పంచ్ పరంధామ రెడ్డి, మండల కోఆప్షన్ మెంబరు ఆలీ, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసులు, ఆదిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.
- తాడిపత్రి మండలంలోని బొందెలదిన్నెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కైపా శ్రీనివాసులరెడ్డి, వంగనూరులో సర్పంచ్ జేసీ అరుణ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత లేదా?



మోటార్ల చోరీపై కమిషనర్‌ను నిలదీస్తున్న వైస్‌ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మున్సిపల్ రా వాటర్ పంప్‌హౌస్‌లో సుమారు రూ.40 లక్షల విలువ కలిగిన రెండు విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత మీకు లేదా అంటూ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి నిలదీశారు. రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల వద్ద సీసీ కెమెరాలు, వాచ్‌మెన్లను ఎందుకు నియమించలేదని ఆమె ప్రశ్నించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, కౌన్సిలర్లు లింగన్న, సుమోబాషా, కోఆప్షన్‌సభ్యుడు మాట్లాడుతూ విద్యుత్ మోటార్లు చోరీ చేసినా పట్టించుకోకపోతే భవిష్యత్తులో మున్సిపల్ కార్యాలయాన్ని దోపిడీ చేసినా మీలో మార్పు వచ్చేలా లేదంటూ కమిషనర్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ మోటార్ల చోరీ జరుగుతుందని తానేమైనా కలగన్నానా? అంటూ కమిషనర్ బాధ్యతారహిత్యంగా మాట్లాడంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విద్యుత్ మోటార్ల చోరీనే కాదు. పట్టణంలో శానిటేషన్ అధ్వాన్నంగా ఉంది. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ లేదు. కౌన్సిల్‌ను గౌరవించట్లేదు. సమస్యలేవైనా చెబితే పట్టించుకోరంటూ నైరుతిరెడ్డి తదితరులు కమిషనర్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ఎవరైనా కాలువ పూడికతీత పనులు చేయిస్తారా? ప్రజాధనాన్ని ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారని ఆమె నిలదీశారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కుమారి, నీలావతి, రంగమ్మ, జేసీబీ .చాంద్‌బాషాతో పాటు పలువురు టీడీపీ కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించ డంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై నిప్పులు చెరిగారు. అనంతరం అభివృద్ధి పనులతో కూడిన అజెండాకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుత్తి: శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో ఓ దళిత బాలికపై అత్యాచారం చేసిన 14 మంది నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. గుత్తిలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, కౌన్సిలర్ వరదరాజులు, జిల్లా నాయకుడు కేఎం రంగనాయకులు, పట్టణ ఉపాధ్యక్షుడు అరుణ్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యం అత్యాచారాల ఘటనలు చోటుచేసుకుంటున్నా కూటమి నాయకులకు చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. మీరు ఎన్ని కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా, రిమాండ్‌కు పంపినా బెదరమన్నారు. బాధిత మైనర్ బాలికను పరామర్శించడానికి వైఎస్సార్ సీపీ నాయకులకు అనుమతి ఇవ్వకపోవడం దారుణన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మల్లికార్జున, ఎస్సీ సెల్ మండల నాయకులు నరేష్, అరటి పండ్ల చంద్ర, దేవా, రామకృష్ణ, వాణిజ్య విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి సీవీ రంగారెడ్డి, జిల్లా కార్యదర్శులు గురుప్రసాద్‌యాదవ్, సుభాష్‌రెడ్డి, గాదిలింగ, రంగస్వామి, పట్టణ ప్రచార అధ్యక్షులు వెల్డింగ్ రవూఫ్, సీనియర్ నాయకులు మర్తాడు దాదు, మర్తాడు అన్సార్, షఫి, రమేష్ రెడ్డి, తోళ్ల షాపు హరి, జీపు హరినాథ్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, కేవీ రమణ, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గుంతకల్లు/గుంతకల్లు టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం స్థానిక సాయినగర్‌లోని బలిజ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పాత్రల పంపిణీతోపాటు చిన్నారులకు అన్నప్రసన, అక్షరాభ్యాస మహోత్సవాన్ని నిర్వహించారు. 119 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్, కుక్కర్, ఇతర పాత్రలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సంరద్బంగా అంగన్‌వాడీ కార్యకర్తలను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు కనీస వేతనం కింద నెలకు రూ.26 వేలు చెల్లించాలని ఎమ్మెల్యేకు అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు వినతిపత్రం అందజేశారు. సీడీపీఓ భారతి, నాయకులు నారాయణస్వామి, కేసీ హరి, బండారు ఆనంద్, రామన్నచౌదరి, మస్తాన్‌యాదవ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పామిడి: రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు బదిలీ అయి రెండునెలలైన వేతనాల మంజూరులో ప్రభుత్వం జాప్యం వీడాలని ఎస్టీయూ నాయకులు నాగభూషణం, సుధాకర్ యాదవ్, రామాంజనేయులు, చంద్రశేఖర్, వీరాంజనేయులు కోరారు. శనివారం పామిడిలో ఏర్పాటు చేసిన ఆ సంఘం ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్ వేతనాలతో పాటు డీఏలు తక్షణం మంజూరు చేయాలన్నారు. అలాగే ఏపీలో పొజిషన్ ఐడీ లేనటువంటి ఉపాధ్యాయులకు తక్షణమే క్యాడర్స్ స్ట్రెంత్ సరిచేసి ఐడీలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు రాజశేఖర్, రామాంజనేయులు, వాసుదేవ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్లే స్కూల్స్, కిడ్స్ ప్లేస్కూల్స్ పేరుతో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ తల్లిదండ్రుల నుంచి ఫీజుల రూపంలో రూ.వేలల్లో దోచుకుంటున్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంశీయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం వైఎస్సార్ ఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఎంఈఓ మస్తానప్పను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వైఎస్సార్ ఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి వంశీ యాదవ్, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు అక్షయ్ మాట్లాడుతూ ఇటీవల గుంతకల్లు పట్టణంలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ ప్లేస్కూల్స్, కిడ్స్‌ప్లే స్కూల్స్ పేరుతో తరగతులు నిర్వహిస్తూ భారీ ఎత్తున ఫీజుల రూపంలో దోచుకుంటున్నాయన్నారు. తక్షణమే సంబంధిత స్కూళ్లపై చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో వైఎస్సార్ ఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చే పడతామని హెచ్చరించారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మణికంఠ, నాయకులు పవన్, గణేష్, అశోక్, సాయి, ప్రవంత్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం



సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

యాడికి: మండలంలోని లక్ష్ముంపల్లి గ్రామ సచివాలయంలో బదిలీ అయిన ఉద్యోగులను శనివారం విశ్రాంత ఉద్యోగి కడితం భాస్కర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజుయాదవ్, హెల్త్ సూపర్‌వైజర్ షబ్బీర్, కడితం వెంగళరెడ్డి, కడితం శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రిలే దీక్షలు



అంబేడ్కర్ సర్కిల్‌లో దీక్ష చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో 13 రోజులుగా నిర్వహిస్తున్న వంద గంటల రిలే నిరాహార దీక్షలు శనివారం ముగిశాయి, చివరిరోజు ఆ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్‌తో పాటు రాజకుమార్, కేశవ, ఓబుళపతి దీక్ష చేవారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సీపీఎం, సీపీఐ నాయకులు పీ అనిమిరెడ్డి, కే రహీమ్, మల్లేసు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈసందర్భంగా వంకరాజుకాలువ వెంకటేష్ మాట్లాడారు. పేదల పెన్నిధి అయిన ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్దరణ కోసం వందరోజుల రిలేదీక్షలను దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ఇందుకు సహకరించిన వామపక్ష పార్టీ, ప్రజాసంఘాలు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ దీక్షల విరమణపై ప్రభుత్వానికి నివేదించాలంటూ డీటీ రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు.

మద్యం విక్రేత అరెస్టు

యాడికి: మండలంలోని బోయరెడ్డిపల్లికి చెందిన వెంకటేష్ మద్యం బాటిళ్లు అమ్ముతుండగా అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. అతడి నుంచి ఏడు7 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గుంతకల్లు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శ్రీ సరస్వతీ విద్యామందిరంలో ఉమ్మడి జిల్లాల విద్యామందిరంలో చదువుతున్న బాలబాలికలకు డివిజనల్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విభాగ్ అధ్యక్షుడు గోపాల్‌కృష్ణ, విద్యామందిరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు వీసీ నర్సింహులు, నారాయణస్వామి, దామోదర్‌గుప్తా, పూర్వకమిటీ సభ్యులు కిరణ్, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి హాజరై క్రీడలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు ఓటమిలను సమానంగా తీసుకొని స్నేహభావంతో మెలగాలన్నారు.

తప్పిన పెను ప్రమాదం

గుంతకల్లు: పట్టణంలో భారీ ఈదురుగాలకు ఓ భారీ ఫ్లెక్సీ విగిరిపోయి విద్యుత్ వైర్లు పడింది. ప్రజలు అప్రమత్తం కావడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాలు.. తెలుగు యువత పట్టణ అధ్యక్షుడిగా రమణ ఎన్నికైన సందర్భంగా స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్‌లోని విద్యుత్ స్తంభానికి దాదాపు 30 అడుగుల ఎత్తున్న భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం ఉదయం భారీ ఈదురు గాలులకు ఫ్లెక్సీ సగం విరిగిపోయి విద్యుత్ వైర్లుకు తగులుకొని ఉండిపోయింది. ఫ్లెక్సీ పడడంతో వైర్ల నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు కరెంట్ సరఫరా తీయించి వైర్లపై ఉన్న ఫ్లెక్సీ తీసివేశారు. ఒకవేళ ఫ్లెక్సీ కిందకు పడిఉంటే పెనుప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా వేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని వాహనాదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాటుసారా స్థావరంపై దాడి

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో నాటు సారా స్థావరంపై ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, ఎస్ఐలు అస్లాం బేగ్, గోపాల్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు చేశారు. స్థావరంలో అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటక మద్యం 106 ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్ల మద్యం, 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కర్నూలు జిల్లా తుగ్గలికి చెందిన ఎరుకల పద్మావతిని అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారు. హెడ్ కానిస్టేబుళ్లు వెంకటనారాయణ, నాగవేణి, వెంకటేశులు, నరశింహరాజు, కానిస్టేబుళ్లు శివయ్య, సునీత పాల్గొన్నారు.

రోడ్డుపై మొక్కలు నాటుతూ నిరసన



రోడ్ల దుస్థితిపై మొక్కలు నాటుతూ నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

గుత్తి: గుత్తిలోని గుంతకల్లు రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. గాంధీ సర్కిల్ వద్ద నుంచి బ్రిడ్జి వరకు రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులతో పాటు పాదచారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు దుస్థితిని తెలియజేస్తూ వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు శనివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై ఉన్న గుంతల్లో మొక్కలు నాటుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, నవీన్, డీవైఎఫ్ఐ నాయకులు అశోక్, చందు, అలీ, ప్రశాంత్, సయ్యద్, రంగా తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ కార్యవర్గం ఎన్నిక

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ ఎన్ఎంయూ గుంతకల్లు డిపో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శులు నాగరాజు, ఎర్రిస్వామి తెలిపారు. శనివారం డిపో వద్ద జరిగిన సమావేశంలో ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడిగా మల్లికార్జున, కార్యదర్శిగా నటరాజ్, గ్యారేజీ అధ్యక్షుడిగా ఖాజా మొహిద్దీన్, కార్యదర్శిగా ఎస్.వీ.రమణ ఎన్నుకున్నారు. అనంతరం కార్మికుల డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ రెడ్‌రిబ్బన్‌లను ధరించి నిరసన తెలిపారు. ఎన్ఎంయూ రీజినల్ సెక్రటరీ ప్రతాప్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

తాడిపత్రి టౌన్: పట్టణంలోని జేహెచ్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్, ప్రకాశం మున్సిపల్ హైస్కూల్లో టెన్త్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు శనివారం తాడిపత్రి పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందజేశారు. జేహెచ్‌ఆర్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థి రస్మికు రూ.5వేలు, ఖాజాబున్నీకి రూ.3వేలు, కావ్యలీలకు రూ.2వేలు, ప్రకాశం మున్సిపల్ హైస్కూల్ అబ్దుల్ హఫీజ్‌కు రూ.5వేలు, రంగజయదేవ్‌కు రూ.3వేలు, చరణ్‌కు రూ.2వేలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, హెచ్ఎంలు రాధాకృష్ణ, సుధాకర్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్య ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ దివస్

గుంతకల్లుటౌన్/గుత్తి: గుంతకల్లు పట్టణంలోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ గోపాల్‌నాయక్ ఎన్‌సీసీ అధికారి బాలకృష్ణ, అధ్యాపకులు రవిశంకర్ శర్మ, జమీలా, గోపీనాయక్, నారాయణ పాల్గొన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని పురావస్తు శాఖ కార్యాలయంలో పురావస్తు శాఖ జిల్లా అసిస్టెంట్ కన్జర్వేటివ్ యోగేష్ ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ దివస్ వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్, ఏఎస్ఐ నాగమాణిక్యం, రిటైర్డ్ జవాన్లు రామ్మూర్తి, కృష్ణయ్య, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

పెద్దవడుగూరు: గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. శనివారం మండలంలోని మేడిమాకులపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు రంగస్వామి గాయపడ్డాడు. రంగస్వామి రోడ్డు దాటుతుండగా ఆటో ఢీ కొంది. గాయపడిన అతడిని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మల్లికార్జున ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రంగస్వామిని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు.

క్రాప్ బుకింగ్, ఇన్సూరెన్స్ తప్పనిసరి

గుత్తి: ప్రతి రైతూ తప్పనిసరిగా క్రాప్ బుకింగ్, ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఏడీఏ వెంకటరాముడు అన్నారు. గుత్తిలోని ఏడీఏ కార్యాలయంలో శనివారం ఏఓ ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యంలో ఐదు మండలాల వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఏఓలు ముస్తాక్ అహ్మద్, మహబూబ్ బాషా, విజయ్ కుమార్, మున్ని కృష్ణ అన్వేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: మండలంలోని పాపినేపాళ్యంకు రైతు వెంకటరెడ్డి పొలాల వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.